











రూ.35వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఆమదాలవలస రూరల్: మండలంలో బెలమాం గ్రామానికి చెందిన జోగులకోటి పార్వతికి పూర్వ విద్యార్థులంతా కలిసి శనివారం ఆర్థికసాయాన్ని అందజేశారు. పార్వతి అనారోగ్యానికి గురికావడంతో వైద్యం ఖర్చుల నిమిత్తం దూసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా కలిసి రూ.35 వేలు అందజేశారు. పూర్వ విద్యార్థులు చిగురుపల్లి అమ్మాజీ, తమ్మినేని జనార్దనమ్మ, వాకముల్లు గోపాలకృష్ణ, కోటేశ్వరరావు, పూజారి ఆనందరావు, గడిదేసి రామారావు, కర్రి ఢిల్లేశ్వరరావు, కోట గిరిబాబు పాల్గొన్నారు.













11 నుంచి సంక్రాంతి క్రీడా సంబరాలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన, చింతాడ రవికుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని రావికంటిపేటలో ఈ నెల 11 నుంచి 13 వరకు 'జగనన్న సంక్రాంతి సంబరాలు' పేరిట ఉత్తరాంధ్ర స్థాయిలో వాలీబాల్ పోటీలు, జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని చెప్పారు. వాలీబాల్, కబడ్డీ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన ఇరు జట్లకు చెరో రూ.50వేల చొప్పున, రెండో స్థానానికి రూ.30వేలు, మూడు, నాలుగో స్థానంలో నిలిచిన జట్లకు రూ.20 వేలు చొప్పున నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేయనున్నట్టు రవికుమార్ వివరించారు. క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. క్రీడలతోపాటు మహిళలకు ముగ్గులు పోటీలు, విద్యార్థులకు జగనన్న నవరత్నాల పథకాలకు సంబంధించి విశ్లేషణాత్మక పోస్టర్స్ తయారీ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.







ఏకగ్రీవంగా పట్టుశాలీ సంఘ కార్యవర్గం ఎన్నిక

పొందూరు: మండల పట్టుశాలీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పట్టుశాలీ కళ్యాణ మండపంలో జరిగిన ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా ఎం.శ్రీరంగనాయకులు, ఉపాధ్యక్షుడిగా బస్వా మన్మథరావు, కార్యదర్శిగా పాలిశెట్టి సూర్య ప్రకాశరావు, ట్రెజరర్‌గా వి.సూర్యారావు, శాశ్వత సభ్యునిగా బాసా ఆనందమోహన్ ఎన్నికయ్యారు.







సైకత శుభాకాంక్షలు



నూతన సంవత్సరం 2023కు స్వాగతం తెలియజేస్తూ లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన ప్రముఖ సైకత శిల్పి తరణి ప్రసాద్ మిశ్రా గ్రామానికి సమీపంలో ఉన్న వంశధార నదీ తీరంలో శనివారం రూపొందించిన సైకత శిల్పం అందరినీ ఆకట్టుకుంటుంది. అన్ని వర్గాల వారికి సకల శుభాలు కలగాలని తరణి ప్రసాద్ మిశ్రా ఆకాంక్షించారు.

-ఎల్.ఎన్.పేట

విజయాలు కలగాలి



రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

ఎల్.ఎన్.పేట: నూతన సంవత్సరంలో అన్ని వర్గాల వారికి విజయాలు కలగాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆకాంక్షించారు. అందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శనివాకం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందరూ సుఖ సంతోషాలతో జీవించాలన్నారు.

సుఖసంతోషాలు కలగాలి



నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: నూతన సంవత్సరంలో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆకాంక్షించారు.

ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023లో జిల్లా ప్రజలకు మేలు జరగాలని కోరారు.

నూతన సంవత్సర వేడుకలకు అందుబాటులో స్పీకర్

ఆమదాలవలస: ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం నూతన సంవత్సర వేడుకలకు అందుబాటులో ఉంటారు. ఆమదాలవలస స్పీకర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉంటారని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయం వద్ద నూతన సంవత్సర వేడుక ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గానికి, జిల్లాకు చెందిన వ్యక్తులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు, తమ్మినేని అభిమానులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

సైనికుల్లా పనిచేయాలి



ఆమదాలవలస: మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం సూచించారు. ఆమదాలవలస పట్టణంలోని శారద కల్యాణ మండపంలో శనివారం సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, మాజీ వైస్‌ఫ్లోర్ లీడర్ ఎ.ఉమామహేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు డి.శ్యామలరావు, డి.చిరంజీవిరావు, ఎస్.కామేశ్వరరావు, జె.కె.వెంకటేశ్వరరావు, శిల్లా మల్లికార్జునరావు, బొడ్డేపల్లి అజంతాకుమారి, పార్టీ నాయకులు బి.రవికుమార్, ఎస్.చిరంజీవి, ఎం.రమేష్, కె.రామకృష్ణ, పి.చిన్నారావు, ఎండా విశ్వనాథం, బి.వి.రమణమూర్తి, ఎస్.చిన్నారావు, బి.రాజు పాల్గొన్నారు.



బూర్జ: స్పీకర్‌కు కేక్ తినిపిస్తున్న ఇందుకూరి రఘు రామరాజు

సమన్వయంతో పనిచేయాలి

బూర్జ: సచివాలయ కన్వీనర్లు బాధ్యతగా పనిచేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శనివారం పార్టీ ప్రత్యేక నియోజకవర్గ పరిశీలకులు ఇందుకూరి రఘు రామరాజుతో కలిసి బూర్జ హైస్కూల్ ఆవరణలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో మాట్లాడారు. 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ మాట్లాడుతూ ప్రజల ఆశలు, ఆకాంక్షలు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర కేక్‌ను స్పీకర్ కట్ చేశారు. ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు, రాష్ట్ర ఔట్ సోర్సింగ్ డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, స్థానిక సర్పంచ్ ఏగు అనురాధ, స్థానిక నాయకులు తొత్తడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న పద్మావతి

జలుమూరు: మండలంలోని లింగన్నాయుడుపేటలో పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు గొండు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ మేరకు ట్రస్ట్ చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ తన తండ్రి గొండు భాస్కరరావు జ్ఞాపకార్థం తన తల్లి పద్మావతి చేతులు మీదుగా నిత్యావసర సరుకులు అందజేశామన్నారు.

114 పింఛన్లు మంజూరు

హిరమండలం: మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో వివిధ కేటగిరీలకు చెందిన 114 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజా తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో మొత్తం 5992 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా.. జనవరి నుంచి కొత్తగా మంజూరైన 114 లబ్ధిరులతో కలిపి 6,106 మంది చేరారన్నారు. రూ.1,62,79000 నిధులు విడుదలైనట్లు తెలిపారు.

టీడీపీ తప్పుడు ప్రచారాలు తిప్పికొట్టండి

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై టీడీపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను గ్రామ సచివాలయం కన్వీనర్‌లు, పార్టీ శ్రేణులు తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. కొత్తూరులో గ్రామ సచివాలయం కన్వీనర్‌లు, గ్రామ వలంటీర్‌ల సమన్వయ సమావేశాన్ని పార్టీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా తీసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న పలు రకాల సంక్షేమ పథకాలను కన్వీనర్‌లు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వలంటీర్‌లతోపాటు కన్వీనర్‌లు వారధిలా ఉండాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, పార్టీ నేతలు బూర్లె శ్రీనివాసరావు, ఎం.చక్రపాణి, గోగల వరప్రసాదరావు నాయుడు, కామక త్రినాదరావు, లోతుగెడ్డ తిరుపతిరావు, దూళి అప్పన్న, కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి, పారాపురం సర్పంచ్ కుంచాల రత్నాలు, జెడ్పీటీసీ కామక భాగ్యవతి, ఏఎంసీ చైర్మన్ గోగల మాధవి, ఎంపీటీసీ గండివలస రత్నకుమారి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుంచాల నూకరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ట్రస్టు చైర్మన్ గోపాలదాసు నాయుడు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కర్లెమ్మకు చెందిన ఎద్దు సుందరనారాయణ వరహాలమ్మ చారటబుల్ ట్రస్టు చైర్మన్ వై.గోపాలదాస్ నాయుడు, సర్పంచ్ భగవాన్ నాయుడు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. గోపాలదాసు నాయుడు కుమారుడు అమిరేష్ నాయుడు వర్ధంతి సందర్భంగా దుస్తులు అందజేశారు. అలాగే కొత్తూరు స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. రామరాజు చారటబుల్ ట్రస్టు చైర్మన్ రామరాజు, ఎస్.భానోజీరావు, కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బి.రవికుమార్, హెచ్ఎం జి.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను ఆదరించే ప్రభుత్వమిది

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు సన్మానిస్తున్న శిష్టకరణ సంఘ నాయకులు

పోలాకి: రాష్ట్రంలోని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలను ఆదరించే ప్రభుత్వం కొనసాగుతుందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శనివారం మబగాంలోని క్యాంప్ కార్యాలయంలో శిష్టకరణాల సంఘనాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీ కోసం కృషిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపునిస్తున్నామన్నారు. జిల్లా ప్రజలకు వైఎస్సార్‌సీపీ తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, శిష్టకరణ సంఘ నాయకులు విశ్రాంత జడ్జి ఎస్ ప్రభాకరరావు, విశ్రాంత ఎంపీడీఓ డి.రఘు, రామ్మోహన్‌రావు, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఎల్.ఎన్.పేట: ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ కాళీప్రసాద్

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్ తన కార్యాలయంలో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కరకవలస గ్రామ సచివాలయం పరిధిలో రెండు, రావిచెంద్రి, పెద్దకొల్లివలస, యంబరాం గ్రామ సచివాలయాల పరిధిలో ఒక్కొక్క గ్రామ వలంటీరు పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించామని తెలిపారు. ఎంపికైన వారి జాబితాను జిల్లా అధికారులకు అందజేశామన్నారు. ఈఓపీఆర్డీ జి.శ్యామలాదేవి పాల్గొన్నారు.

సారవకోట: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాండ్రాయి, తొగిరి, పెద్దలంబ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, తహసీల్దార్ ప్రవల్లికాప్రియలు ఇంటర్వ్యూలు చేపట్టారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నవనీత సేవ



వేంకటేశ్వర స్వామిని వెన్నతో అలంకరించిన దృశ్యం

సారవకోట: మండలంలోని చీడిపూడి కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామిని నవనీత సేవ నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మూల విరాట్‌లను 25 కేజీల వెన్నతో అలంకరించారు. తొలుత ఆలయంలో సుప్రభాత సేవ, విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ కృష్ణప్రసాద్

సరుబుజ్జిలి: నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ సరదాగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. జూదం, హంగామా, మందు పార్టీల పేరుతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. శాంతి భద్రతలకు ఇబ్బందులు కలగకుండా వ్యవహరించాలని సూచించారు.

కుల వివక్ష చూపొద్దు



మురుగు నీటి కాలువలను పరిశీలిస్తున్న అధికారులు

సారవకోట: గ్రామాల్లో కుల వివక్ష చూపొద్దని తహసీల్దార్ ప్రవల్లికాప్రియ సూచించారు. శనివారం మండలంలోని గొర్రిబంద పంచాయతీ బురుజువాడ గ్రామంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులాల మధ్య అంతరాలు, తారతమ్యాలుండరాదని, అందరూ సమానంగా ఉండాలన్నారు. అయితే తమ గ్రామంలో ఎటువంటి కుల వివక్ష లేదని, అందరం కలిసికట్టుగా ఉంటున్నామని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో మురుగు నీటి కాలువలు శిథిలమైపోయాయని, పూడికలతో నిండి పోతున్నాయని, వాటిని మరమ్మతులు చేపట్టాలని పలువురు గిరిజనులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, ఎంఈఓ ఎం.వి.రమణ, వీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



చాపర మిల్లు వద్ద బారులు తీరిన ధాన్యం ట్రాక్టర్లు

మెళియాపుట్టి: మండలంలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేస్తున్నామని తహసీల్దార్ సరోజిని, ఏఓ ధానకర్ణుడు తెలిపారు. రైతులకు వెసులుబాటు కల్పిస్తూ వారికి అవకాశం ఉన్న మిల్లులకే ధాన్యాన్ని తరలించేలా ఏర్పాట్లు చేశామని తెలియజేశారు. శనివారం నాటికి 6000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా డిసెంబర్ 25వ తేదీవరకు ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులను ప్రభుత్వం జమ చూసిందన్నారు. ప్రతీ ధాన్యం గింజ కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. మండలంలోని చాపర మిల్లుల వద్ద ధాన్యంతో ట్రాక్టర్లు బారులు తీరాయి.

బియ్యం తరలింపు వేగవంతం చేయాలి



రైస్ మిల్లును పరిశీలించి సూచనలిస్తున్న తహసీల్దార్

సారవకోట: ధాన్యం సేకరణ అయిన తరువాత వాటిని మిల్లింగ్ చేసి బియ్యం ఎఫ్‌సీఐకి తరలింపు వేగవంతం చేయాలని మిల్లర్లుకు తహసీల్దార్ ప్రవల్లికాప్రియ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లును పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం ట్రక్కుల నుంచి త్వరగా అన్‌లోడ్ చేసి వాటిని బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐకి తరలింపు వేగవంతం చేయాలన్నారు. మండలంలో ఒకటి, రెండు మిల్లులు మిల్లింగ్ ఆలస్యం చేస్తున్నాయని, వారు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆమదాలవలస: బ్రాహ్మణసంఘం క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం అధ్యక్షులు, తదితరులు

ఆమదాలవలస: మండల బ్రాహ్మణ సంఘం-2023 క్యాలండర్‌ను శనివారం సాయంత్రం గేదెలవానిపేట వద్ద గల ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆ సంఘం అధ్యక్షుడు బి.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా గాంధీ స్మారకనిధి అధ్యక్షుడు మేడూరి ప్రసాద్‌రావు హాజరయ్యారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి, ఉపాధ్యక్షుడు బలివాడ చిట్టి సన్యాసిరావు(చిట్టిపంతులు), కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో..

కొత్తూరు: ఏపీటీఎఫ్ కొత్తూరు మండలశాఖ ఆధ్వర్యంలో 2023 క్యాలెండర్, డైరీలను ఎంఈఓ బి.శ్రీధర్, ఏపీటీఎఫ్ మండల శాఖ ప్రతినిధులు సత్యనారాయణ, శాంతారావు, పలువురు నేతలు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ మండల శాఖకు చెందిన పలువురు నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ పోరాటాలను గుర్తుచేశారు. 2023లో ఉపాధ్యాయులకు అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు. ఏపీటీఎఫ్ నేతలు వి.శ్రీనివాసరావు, ఇంద్రతనయ, లోకేష్, వి.చంద్రమౌళిరాజు, ఎంఆర్‌సీ సిబ్బంది రాజేష్, ఈశ్వర్య, అప్పలనాయుడు, పలువురు ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సర్వేయర్ ఉద్యోగుల క్యాలెండర్..

పాతపట్నం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కె.రవిచంద్ర, జిల్లా సంఘం యూనిట్ సభ్యుడు లోకేష్ శనివారం ఏపీసర్వే ఉద్యోగుల 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పాతపట్నం తాలుకా సెక్రటరీ సతీష్, వైస్ ప్రెసిడెంట్ పాపారావు, ట్రెజరర్ నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ రామకృష్ణ, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.



కొత్తూరు: ఏపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, తదితరులు



పాతపట్నం: ఏపీ సర్వేయర్ల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రవిచంద్ర, తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బద్దుమర్రిలో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మూడేళ్లలో ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన ప్రయోజనాన్ని ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని బద్దుమర్రి గ్రామ సచివాలయ పరిధిలోని బద్దుమర్రి, బొమ్మిక, కాశీపురం, హరిద్వారం గ్రామాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కాలనీలు మంజూరు చేయాలని పలువురు మహిళలు ఎమ్మెల్యేను కోరారు. రెండో విడత జగనన్న కాలనీలు వచ్చాయని, దరఖాస్తులు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ, ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్, ఎంఈఓ సీహెచ్ మణికుమార్, ఎంపీడీఓ సురేష్, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, పార్టీ నాయకులు శ్రీధర్, మన్మధరావు, తరుణ్, ఢిల్లేశ్వరావు, శ్రీనువాసరావు, గూరాడ అప్పన్న, ఎనుగుతల సూర్యం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలు బాగుచేయాలి



పిల్ల కాలువ ఇలా..

సరుబుజ్జిలి: యరగాం-పురుషోత్తపురం ఓపెన్‌హెడ్ ఛానల్ నుంచి తురకపేట, మూలసవళాపురం గ్రామాల పరిధిలో గల పిల్ల కాలువలు పూర్తిగా మూతపడడం వల్ల సుమారు 200 ఎకరాల పంట భూమికి ప్రతి ఏటా సాగునీటికి ఇబ్బందులు వస్తున్నాయని రైతులు తెలిపారు. టీడీపీ హయాంలో చేపట్టిన నీరు-చెట్టు పనులు ఆ పార్టీ కార్యకర్తల జేబులు నింపడానికే ఉపయోగపడ్డాయన్నారు. కాలువ నిండా పిచ్చి మొక్కలు, పూడిక పేరుకుపోవడం వల్ల సాగునీరు రావడంలేదని తెలిపారు.

అపోహలు నమ్మవద్దు

సరుబుజ్జిలి: పింఛన్లు తొలగిస్తున్నట్లు వస్తున్న అపోహలు నిజంకాదని ఎంపీడీఓ పీవీ మురళీమోహన్ కుమార్ శనివారం ప్రకటనలో వెల్లడించారు. మండలంలో 2022 జూలై నాటికి 5,192 పింఛన్లు పంపిణీ చేశామని, మరలా 2023 జనవరిలో 134 కొత్త పింఛన్లు పంపిణీ చేస్తామని తెలిపారు. అర్హతకలిగిన ప్రతీ ఒక్కరికి ఏడాదికి రెండుసార్లు పింఛన్లు మంజూరుచేస్తామని, పుకార్లు నమ్మవద్దన్నారు.

సందడిగా నూతన సంవత్సర వేడుకలు



నరసన్నపేట: ఇందిరానగర్‌లోని ఓ అపార్ట్ మెంట్లో సందడి చేస్తున్న మహిళలు



హిరమండలం: సవర చొర్లంగి పాఠశాలలో 2023 సంఖ్యను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



హిరమండలం: ఆదర్శ పాఠశాలలో 2023 ఆకారంలో విద్యార్థులు కూర్చున్న దృశ్యం



కొత్తూరు: రంగులు విక్రయిస్తున్న దృశ్యం

హిరమండలం: మండలంలోని పలు పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఉపాధ్యాయులు కేక్‌లు కట్‌చేసి విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. మండలంలోని పెద్దకోరాడ, హిరమండలం సుభలయ, సవర చొర్లంగి ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేటు పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు చేపట్టారు. సవరచొర్లంగి పాఠశాలలో నూనత సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు 2023 ఆకారంలో ప్రదర్శించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన సంవత్సరాన్ని స్వాగతం పలుకుతూ రకరకాల రంగవల్లులు వేశారు. యువత కేరింతలు కొడుతూ నూతన సంవత్సరాన్ని స్వాతగం పలికారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో నూతన సంవత్సర వేడుకలు శనివారం రాత్రి సందడిగా నిర్వహించారు. 2022కి వీడ్కోలు పలికి 2023కు స్వాగతం పలుకుతూ మహిళలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఇందిరానగర్‌లోని ఓ అపార్ట్ మెంట్లో మహిళలు సందడి చేశారు.

కొత్తూరులో..

కొత్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడులు ఘనంగా నిర్వహించారు. కొత్తూరు మార్కెట్‌లో రంగుల అమ్మకాలు చేపట్టారు. యువత శనివారం రాత్రి సందడి చేశారు.



వారమండలం: పెద్దకోరాద పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



హిరమండలం: రంగవల్లులు వేస్తున్న మహిళలు

విద్యకు ప్రభుత్వం పెద్దపీట



పాతపట్నం: విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: రాష్ట్రంలో విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని గంగువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా విస్మరించిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నమ్ముతున్నారన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నారన్నారు. అందులో భాగంగా నాడు-నేడు రెండో విడతలో గంగువాడ హైస్కూల్ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారన్నారు. జగనన్న అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలను అమలు చేస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఎంఈఓ సీహెచ్ మణికుమార్, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, హెచ్‌ఎం ఎస్.కుమారస్వామి, పార్టీ నాయకులు శ్రీనివాసరావు, ఢిల్లేశ్వరరావు, వై.సూర్యం, కర్రి లక్ష్మీనారాయణ, గురాడ అప్పన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

పొందూరు: విద్యార్థుల జ్ఞాన సముపార్జనకు ట్యాబులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ అన్నారు. మండలంలోని లోలుగు హైస్కూల్, లోలుగు కేజీబీవీ, రాపాక మోడల్ స్కూల్, బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేశారు. బైజూస్ పాఠ్యాంశాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. ఎంఈఓ పీవీ రామరాజు, కంబాపు సూర్యారావు, పెద్దింటి రవిబాబు, హెచ్‌ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



పొందూరు: లోలుగులో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి



పంచాయతీ సమావేశంలో పాల్గొన్న సర్పంచ్, సభ్యులు

నరసన్నపేట: స్థానిక మేజరు పంచాయతీకి ఆదాయం వచ్చే మార్గాలపై పంచాయతీ సిబ్బంది అలసత్వం చూపుతున్నారని సభ్యులు ఆర్.శ్రీధర్, ఎస్.కృష్ణబాబు, పి.కృష్ణ ప్రసాద్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి పన్ను వసూలులో కూడా తీవ్ర అలసత్వం చూపుతున్నారని, దీని వల్ల పంచాయతీ అభివృద్ధి కుంటుపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈఓ సింహాద్రినాయుడును నిలదీశారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ వార్డు సభ్యుల సమావేశం సర్పంచ్ బూరల్లి శంకర్ అధ్యక్షతన జరిగింది. ఇళ్ల పన్నులు రూ.1.20 కోట్లు బకాయలు ఉన్నాయని, వీటి వసూలుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలన్నారు. పన్నుల వసూలుపై పూర్తిదృష్టి పెడతామని, ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని సభ్యులకు సర్పంచ్ శంకర్, ఈఓ హామీ ఇచ్చారు. వీధి లైట్లు వేయాలని కొందరు సభ్యులు కోరగా.. కొత్తవి కొనేందుకు, పాతవి మరమ్మతులు చేయడానికి సభ్యులు అంగీకరించారు.

మంచినీటి సరఫరాలో ఎటువంటి ఆటంకాలు రాకుండా చూడాలని, శానిటేషన్‌పై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలని సభ్యులు కోరగా.. ఈ మేరకు తగిన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హామీ ఇచ్చారు. సర్పంచ్ మాట్లాడుతూ వీధి లైట్లు వెలగకపోతే వెంటనే తెలియజేయాలని సూచించారు. వార్డు సభ్యులు కేసీహెచ్‌బీ గుప్త, బీఎల్ శర్మ, ఇప్పిలి నీలంరాజు, బోయిన సతీష్, ఎంపీటీసీ వైశ్యరాజు కేశవరాజు పాల్గొన్నారు.

రబీ వరి సాగుపై రైతుల ఆసక్తి



కోమర్తి వద్ద ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

నరసన్నపేట: మండలంలోని రైతులు రబీ వరిపై ఆసక్తి చూపుతున్నారు. ధాన్యం సేకరణలో ప్రభుత్వం నూతన విధానాలు పాటించడంతో ఆరుగాలం శ్రమించి పండించే ధాన్యానికి మద్దతు ధర లభించింది. దీనిని దృష్టిలో పెట్టుకొని రబీలో కూడా వరిని పండించి అదనపు ఆదాయాన్ని పొందాలని రైతులు చూస్తున్నారు. దీంతో మండలంలో అంప్లాం, నారాయణవలస, కరగాం, కంబకాయ, జగన్నాథపురం, బుచ్చిపేట, గొట్టిపల్లి, కోమర్తి, మాకివలస తదితర గ్రామాల్లో రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంట్లో భాగంగా టాక్టర్లతో పొలాలను దమ్ములు చేస్తున్నారు. జనవరి మొదటి వారంలో ఉభాలు చేస్తే మంచి దిగుబడి వస్తుందని ఈ మేరకు దమ్ములు చేస్తున్నారు. చెరువులు, వంశధార కాలువల్లో పుష్కలంగా నీరు ఉంది. వ్యవసాయ శాఖ, వంశధార అదికారులు మాత్రం రబీలో వరి కంటే వాణిజ్య పంటలు వేయాలని సూచిస్తున్నారు.

శ్రీరామ మహాయజ్ఞం జయప్రదం చేయాలి



సన్నాహక సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

సరుబుజ్జిలి: రొట్టవలస శ్రీరామానందాశ్రమం ఆవరణలో త్వరలో నిర్వహించనున్న యజ్ఞకుండ శ్రీరామానామలిఖిత మహాయజ్ఞాన్ని విజయవంతం చేయాలని ఆశ్రమ వ్యవస్థాపకులు తొత్తడి వెంకటరమణ స్వామి కోరారు. ఈ మేరకు శనివారం గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులతో సమావేశం నిర్వహించారు. 108 యజ్ఞకుండలతో వేదపండితులు ఆధ్వర్యంలో చేపట్టనున్న మహాక్రతువును జయప్రదం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల బూత్ కమిటీ కన్వీనర్ మూడడ్ల రమణ, కుసుమంచి హరీష్, వేదపండితులు మావుడూరి సుబ్రహ్మణ్య శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.